RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 293 పేజీలు - 08 గురువారం 17 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు


- దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని సూచించారు. బెంగళూరులో ఇంటర్నే షనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేష న్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరు పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. అయినప్పటికీ.. ఈ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని తొలగించాలనే గళాన్ని వినిపించే వాళ్లు మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 16:** 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు మిగతా2లో...

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ




2లో

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే
- హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది?
- అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్



**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 16:** మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. “అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?” అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మిగతా2లో...

## ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



2లో



## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16:** యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) మిగతా2లో...



## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

- కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- 51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16:** దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మిగతా2లో...

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ




2లో

## అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్




**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 16:** అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 మిగతా2లో...

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్? ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్?ఎఫ్?ఎస్? దక్కించుకుందని వివరించారు. ఐఎల్?ఎఫ్ఎస్?, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు. **పథకం ప్రకారమే గెంటేశారు** వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 16:** రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నా మని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. చీవీజూ-ూా పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ+ూా) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ+ూా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

# ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే...

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 16:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అవసరం అయ్యారని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, పన్నుల వసూళ్ల రంగానికి దీర్ఘకాలి కంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైనే ప్రతి ఒక్కరూ ప్రధానంగా దృష్టి సారించాలని నిర్మల సీతారామన్ చెప్పారు. పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, వ్యయం వృథా అవుతుందనే వివరాలను గణాంకాలతో సహా నిరూపించాలని కోరారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటో కూడా ప్రతిపాదించాలని, ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని నిశితంగా అంచనా వేయాలని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. వీటి వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుంది, పన్ను పరిధి ఏ మేరకు ప్రభావితమవుతుంది, పన్నుల నిర్వహణపై ఎలాంటి ఫలితాలు ఉంటాయనే విషయాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎంతైనా అవసరమని వివరించారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. పన్నుల పరిధిని విస్తృతం చేస్తూనే, విధానపరమైన అడ్డంకులను తొలగించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

(మొదటి పేజీ తరువాయి)

విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**తొలి అక్షరం/హైదరాబాద్,సెప్టెంబర్ 16:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి...

**అనామిలిస్, మ్యామింగ్ ఓటర్ల జాబితా వేగవంతం చేయాలి**

**కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి త్వరితగతిన జారీ చేయాలి**

**బిఎల్ఓలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలి**

**ఖమ్మం నగరంలో పాత డిఆర్డీవో కార్యాలయం ఆవరణ జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబరు- 16:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు.నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి సెప్టెంబరు- 16:** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఓజోన్ సంరక్షణతోనే జీవకోటి పరిరక్షణ.. 'ఓజోన్ సంరక్షణ దినోత్సవం

**అప్పలరావుపేట హెచ్ఎం బి,శ్రవణ్ కుమార్.**

**ఘనవ్యర్థాలు, ఈ-వేస్ట్ నిర్వహణపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన.**






**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 16:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని అప్పలరావుపేట ఉన్నత పాఠశాలలో మానవాళి మనుగడకు, భూమిపై జీవకోటి రక్షణకు రక్షక కవచంలా నిలిచే ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్ అన్నారు. నెక్కొండ మండలం అప్పలరావుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో "ఓజోన్ సంరక్షణ దినోత్సవం" పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ సూర్యుని నుండి వెలువడే ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపైకి పడకుండా ఓజోన్ పొర త్రిశూలంలా అడ్డుకుంటుందని తెలిపారు. రసాయనాలు, క్లోరోఫ్లోరో కార్బన్స్ వాయువుల విడుదల, విపరీతమైన కాలుష్యం కారణంగా ఓజోన్ పొర క్షీణిస్తూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీలైనంత మేర రిఫ్రిజిరేటర్లు ఎయిర్ కండిషనర్లు ఏరోసోల్ ద్రావణాల పిచికారిని తగ్గించి ఓజోన్ పొర సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారుప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నివారించి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఘన వ్యర్థాలు, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్న వ్యర్థాల నిర్వహణపై విస్తృత చర్చ జరగాలన్నారు. ఇంట్లో ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. పాడైపోయిన మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, బ్యాటరీలు వంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు భూమిలో కలవడం వల్ల భార లోహాలు నదులు, భూగర్భ జలాల్లోకి చేరి విషతుల్యం అవుతున్నాయని, వీటిని శాస్త్రీయ పద్ధతిలో పునర్వినియోగానికి తరలించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యా యులు రవీంద్రనాథ్, గీత, యాకయ్య, భూలక్ష్మి, వెంకట్రాజం, దయాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**● అంకిరెడ్డిగూడెంను మాదకద్రవ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి : సీఐ జి. మన్మథ కుమార్**





**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 16:** చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రచ్చబండ ఆవరణలో సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన పోలీసు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ జి. మన్మథ కుమార్, ఎస్ఐ నర్సిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు, జూదం, బెట్టింగ్‌లు, సామాజిక మాధ్యమాల మోసాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాన్ని మాదకద్రవ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ పోలీసుల సూచనలు పాటించి అంకిరెడ్డిగూడెంను సురక్షిత, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదామని అన్నారు. అనంతరం సీఐ, ఎస్ఐలను సర్పంచ్ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, పోలీసు సిబ్బంది, మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ సభ్యులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పునరుద్ధరణకు ఫార్మ్ కుంటలు ఎంతో ఉపయోగకరం

**● ఎస్.లింగోటంలో ఫార్మ్ కుంట నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 16:** వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫార్మ్ కుంటలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్వాములవారి లింగోటం గ్రామ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమిడి ప్రదీప్ జీ అన్నారు.బుధవారం ఎస్.లింగోటం గ్రామంలోని శివుని బావి చెల్కలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫార్మ్ కుంట నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం ఎప్పుడు పడుతుందో మన చేతుల్లో లేకపోయినా, పడిన వర్షపు నీటిని సంరక్షించుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు. ఫార్మ్ కుంటల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయడంతో భూగర్భ జలాల పెంపు, నేలలో తేమ నిల్వ, పంటలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. రైతుల భవిష్యత్తు, గ్రామంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఫార్మ్ కుంటలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ్య, గ్రామ కార్యదర్శి మచ్చగిరి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మ, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలకు నిరసనగా రైతు సంఘం ధర్నా

**తొలి అక్షరం/ రామన్నపేట సెప్టెంబర్ 16:**అప్రకటిత విద్యుత్ కోతలను నివారించి రైతులకు 18 గంటల విద్యుత్ ఇవ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రామన్నపేట విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, జల్లెల పెంటయ్య మాట్లాడుతూ కోతల వల్ల పంటలు ఎండిపోతున్నాయని, లోవోల్టేజ్ తో మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు. అదనపు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, బోయిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నకిరేకల్ ప్రముఖుడు ప్రకాష్ రావుకు నివాళి

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 16:**నకిరేకల్ పట్టణ ప్రముఖుడు, రిటైర్డ్ టీచర్ బిచ్చనేపల్లి ప్రకాష్ రావు మృతి చెందారు. వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి పాల్గొని సంతాపం తెలిపారు.



# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్16:**ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చేపట్టనున్న ప్రచార కార్యక్రమాలపై ములుగు జిల్లా కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొర్ర సుమలత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, మహిళా మోర్చా కార్యకలాపాలను విస్తరించడం మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. కొర్ర సుమలత మాట్లాడుతూ..ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు మద్దతుగా సెప్టెంబర్ 17న సాయంత్రం 7 గంటలకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద 'ఆశీర్వాద దీపం వెలిగించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకర్ రావు, సీనియర్ నాయకుడు కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాళ్లు బాతు నిర్మల, గోకు రజిత, రావుల స్వప్న, జిల్లా కార్యదర్శులు ఏలక గంగ, అరుణ, కోమల సరిత, ట్రెజరర్ కొత్తపల్లి అరుణతో పాటు సంధ్య, సావిత్రి, లలిత, రమాదేవి, సుమలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తి... గుబ్బగుర్తి హైస్కూల్ విద్యార్థులకు అన్నదానం



**తొలి అక్షరం/ కొనిజర్ల సెప్టెంబర్ 16:** కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో చల్లగుండ్ల రమేష్ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా బుధవారం గుబ్బగుర్తి హైస్కూల్ విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలను విద్యార్థులతో కలిసి సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి, ఉపసర్పంచ్ యుగేందర్, హైస్కూల్ చైర్మన్ కుంచాల నాగమణి, హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# బంగారు మైసమ్మ, పాపమ్మ దేవాలయ నిర్మాణానికి రావుల మాధవరెడ్డి ఆర్థిక సాయం హామీ

**● తాళసింగారం గ్రామ దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ**



తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 16:చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళసింగారం గ్రామంలో నిర్మించనున్న బంగారు మైసమ్మ, పాపమ్మ దేవాలయ నిర్మాణానికి ప్రముఖులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ కుల పెద్దలు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ట్రస్ట్ చౌటుప్పల్ చైర్మన్, చౌటుప్పల్ గ్రంథాలయం మాజీ చైర్మన్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డిని ఆయన నివాసంలో కలిసి దేవాలయ నిర్మాణ వివరాలను తెలియజేశారు.దేవాలయ నిర్మాణం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించగా, డాక్టర్ రావుల మాధవరెడ్డి వెంటనే స్పందించి తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ నిర్మాణానికి సహకరిస్తానని ముందుకు రావడం పట్ల గ్రామ కుల పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.బంగారు మైసమ్మ, పాపమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ రావుల మాధవరెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు దేవాలయ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా వారి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తాళసింగారం గ్రామ కుల పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఇ.ఎల్.వి. భాస్కర్

**- 70కి పైగా కంపెనీలతో ఈ నెల 19న మెగా ఉద్యోగ మేళా**

తొలి అక్షరం/చౌటుప్పల్:సెప్టెంబర్ 16: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ తెలిపారు.యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నెల 19న లక్కారం గ్రామంలోని వి.వి.ఆర్. గార్డెన్స్‌లో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ మేళాలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నాయని పేర్కొన్నారు.10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇ.ఎల్.వి. భాస్కర్ పిలుపునిచ్చారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒకే వేదికపై అనేక కంపెనీల్లో ఇంటర్వ్యూలకు అవకాశం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చేస్తున్న ఈ ప్రయత్నానికి నిరుద్యోగ యువత నుంచి మంచి స్పందన వస్తోంది. ఉద్యోగ మేళాకు ప్రవేశం పూర్తిగా ఉచితమని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95508 43338 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# పిఆర్‌టియు టీఎస్‌లో చేరినా వేముల ప్రకాష్



తొలి అక్షరం/పెద్దవంగర సెప్టెంబర్ 16: మండలం లోని టీచర్స్ బడి వెబ్ సైట్ ద్వారా సేవలు అందించిన, చిట్టి జాబిలి చానెల్ సృష్టి కర్తగా, టి ఎల్ ఎం మేకర్ గా, వర్క్‌షీట్స్ రూపకర్త గా తెలిసిన, సుపరిచితుడు అయిన, ప్రస్తుతం యు పి ఎస్ చిన్నవంగర లో పని చేస్తున్న వేముల ప్రకాష్ అనే ఉపాధ్యాయుడు టి పి టి ఎఫ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి పి ఆర్ టి యు టీ ఎస్ లో చేరినాడు. గత 20 నెలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి పని తీరుకు ఆకర్షితులై, ఉపాధ్యాయ సంఘాలలో అతి పెద్ద సంఘమైన పి ఆర్ టి యు టీ ఎస్ వల్ల మాత్రమే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించబడుతాయి అనే విశ్వాసంతో ఈయొక్క సంఘ లో చేరుతున్నానని తెలియ పరిచినాడు. పెద్ద వంగర మండల శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం డి యాకూబ్ పాషా సభ్యత్వ నమోదు రసీదు ఇచ్చి ఆహ్వానించగా, ఈ కార్యక్రమంలో సంఘ సీనియర్ సభ్యులు యాకుబ్ రెడ్డి. గూగులోతు నిఖిల్. తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సర్వీసు పునరుద్ధరణకు ఆర్టీసీ డీఎంకు వినతి

**- పెద్ద కొర్పోల్ మాజీ ఎంపీటీసీ బిజెపి జిల్లా నాయకులు అంబాల రామ్ గోపాల్ గౌడ్**





తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 16: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి నెక్కొండ మీదుగా హైదరాబాద్‌కు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసును ఇటీవల రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ళుగా కొనసాగుతున్న మానుకోటపెద్దకొర్పోలు ఇంటికన్నెవెంకటగిరికేసముద్రం గుండ్రపల్లి మడివల్లికాన్నతండానెక్కొండహైదరాబాద్ మార్గంలోని సర్వీసును పునరుద్ధరించాలని మాజీ ఎంపీటీసీ, బీజేపీ జిల్లా నాయకుడు అంబాల రాంగోపాల్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, తదితరులు మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు సానుకూలంగా స్పందించి, రూట్‌మ్యాప్‌ను పరిశీలించి వారంలోగా బస్సు సర్వీసును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల రామ్ గోపాల్ గౌడ్, అనుముల భద్రయ్య, మెండె బుచ్చయ్య,మరియు మహిళా సంఘాలు సుమలతవివో అధ్యక్షురాలు, మేడి సుమలత సీఏ, మాదాసు రమ్య సుధా సి ఎ, మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన రిటర్డ్ కరెంట్ ఏ ఈ చల్లా రగోత్తం రెడ్డి



తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 16:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామ వాస్తవ్యులు నెక్కొండ మండల మాజీ ఎంపీపీ బొల్లపల్లి రాజేందర్ మరణించగా వారి పార్థివదేహానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన రిటర్డ్ కరెంట్ ఏ ఈ చల్లా రగోత్తాం రెడ్డి చల్లా కిషన్ రెడ్డి, మాజీ విద్యాకమిటి చైర్మన్ గరికపాటి కృష్ణ రావు, తాళ్లపెల్లి భాస్కర్ గౌడ్, పొక్కుల కృష్ణ మూర్తి మహ్మద్ మదర్ మహ్మద్ యాకుబ్ పాషా తదితరులు పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మారగొని శ్రీనివాస్ గౌడ్



తొలి అక్షరం :వలిగొండ, సెప్టెంబర్ 16: ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మండల కేంద్రానికి చెందిన ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగొని శ్రీనివాస్ గౌడ్ ను నియమించారు. బుధవారం భువనగిరి లో ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ను ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించిన అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ అధ్యక్షునిగా కొలను శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మారగొని శ్రీనివాస్ గౌడ్ ను, జిల్లా సలహాదారులుగా బొడిగే సుదర్శన్,నారగోని అంజయ్య,భువనగిరి ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా రత్నపురం శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బట్టు రామచంద్రయ్య, ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగుఅంజన్న, దుగ్యాల శ్యామల, జగన్, చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేణి స్వామి, పాల్గొన్నారు.


# జిల్లా స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా బింగి గణేష్



తొలి అక్షరం/జవహర్ నగర్,సెప్టెంబర్16: తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కుషాయిగూడ హాల్లో జిల్లా ఉత్తమ అధ్యాపకుల ఎంపిక జరిగినది. ఈ యొక్క ఎంపికలో ఘట్కేసర్ కు చెందిన బింగి గణేష్ ఉత్తమ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. గణేష్ గత 20 సంవత్సరాలుగా రసాయన శాస్త్ర అధ్యాపకునిగా ఎంతోమంది విద్యార్థులకు విద్య బోధించి ప్రభుత్వ ఉద్యోగస్తులుగా ప్రైవేటు ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం గణేష్ విజ్ఞాన భారతి జూనియర్ కాలేజీ జవహర్ నగర్ లో రసాయన శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. గణేష్ ని పలువురు టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఏ విజయకుమార్ , మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కర్నే సురేందర్ అభినందించారు. ఈ యొక్క కార్యక్రమంలో మౌంట్ ఫోర్ట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ భాగ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు, కే విజయ్ , ఉపాధ్యాయులు మురళి ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


# కళాకారుల బతుకులతో ఆటలాడొద్దు

- **సంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు భర్తీ చేయాలి: నాగేల్లి మురళి**
- **ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి**
- **కాలయాపన చేయకుండా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి**
- **ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తాం**



తొలి అక్షరం/ఇనుగుర్తి సెప్టెంబర్ 16: మహబూబాబాద్: తెలంగాణ ఉద్యమంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచిన కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ ఉద్యమ గాయకుడు నాగేల్లి మురళి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాకారులను ఆదుకుంటామని, ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని పొందుపరిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఉద్యోగాల భర్తీపై చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కళాకారులను ఆదుకుంటామని చెప్పడం మాటలకే పరిమితం కాకుండా, వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని మురళి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, సంబంధిత కమిటీ నాయకులతో చర్చించి సంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ కోసం పోరాడిన కళాకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మురళి అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 33 జిల్లాల కళాకారులను ఏకం చేసి పెద్దఎత్తున ఆందోళనలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే 'చలో రవీంద్రభారతిముట్టడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కాలయాపన చేయకుండా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు.

# నేడు తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి



తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 16: నెల్లికుదురు స్థానిక కేంద్రం తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నెల్లికుదురు మండల అధ్యక్షుడు చందు రాజ్ ఆధ్వర్యంలోబీజేపీ మండల నాయకులు తహసీల్దార్ ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రజల పోరాట చరిత్రను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేసే విధంగా సెప్టెంబర్ 17 కార్యక్రమాలను అధికారికంగానిర్వహించాలని, వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి యకి రెడ్డి. తోట రమేష్ జల్ల రమేష శివ సాయి కనుకుట్ల శ్రీకాంత్ సలుకు ప్రవీణ్ తోట సురేష్ శ్రవణ్ కోపు లక్ష్మణ్ దాసరి రాజశేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామగిరిలో జాతీయ మాల మహానాడు గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**- జంజీరాల రమేష్ అధ్యక్షుడిగా.. గాజుల సంపత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక**




తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 16: నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామంలో జాతీయ మాల మహానాడు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ జిల్లా జాతీయ మాల మహానాడు అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్ ఆదేశాల మేరకు, నెల్లికుదురు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షులుగా జంజీరాల రమేష్, ప్రధాన కార్యదర్శిగా గాజుల సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు గ్రామ కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మద్దెల రమేష్, అద్దంకి యువసేన మండల అధ్యక్షులు బాణాల సంజీవ, మండల ఉపాధ్యక్షులు మయ్య వెంకన్న, మండల నాయకులు మయ్య వీరన్న, గాజుల ఉప్పలయ్య, కారం రమేష్, జంజీరాల నరేష్, పల్లె సుందర్, గాజుల శేఖర్, గాజుల కిరణ్, చదల రవి, గుర్రాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని సేవలో శ్రీకాంత్.. రైతులకు సమృద్ధిగా వర్షాలు కురవాలని పూజలు

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. షాద్‌నగర్ వార్డు సభ్యుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్**

**గణపయ్య ఆశీస్సులతో ప్రజలకు మేలు జరగాలి..**



తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 16: గణనాథుని ఆశీస్సులతో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని షాద్‌నగర్ వార్డు సభ్యుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బుధవారం నందిగామ మండలం తాటిగడ్డతండాలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ ఉత్సవాల నిర్వహణకు చందా సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గణపయ్య ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీ తండా 1వ వార్డు సభ్యుడు జటావత్ రాజేష్, 2వ వార్డు సభ్యులు జటావత్ మాధవి, లక్ష్మణ్ నాయక్, జటావత్ నరేష్ నాయక్, జటావత్ శ్రీను నాయక్, కమిటీ అధ్యక్షుడు జటావత్ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

• సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి • సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి



**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 16:** నిన్న నెల్లికుదురు మండలంలో బ్రాహ్మణ కొత్తపల్లి నైనాల నెల్లికుదురు మునిగల వీడు లలో ఉన్న తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్తూపాల వద్ద నివాళులు అర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ నిలికుదురు ప్రాంతంలో నాడు నిజాం రాజును గడగడలాడించిన యోధులు కొండపల్లి గోపాలరావు వరిపల్లి నరసయ్య, చిర్రా లింగయ్య, సీతారామయ్య, నేతలే అన్నారు ఈ ప్రాంతంలో 300 మంది బలి ఇచ్చి తెలంగాణ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం కావడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని అన్నారు నెలకుదురు సాయుధ పోరాటంలో ఈ ప్రాంత 0 కీలక పాత్ర పోషించింది అన్నారు బిజెపి పార్టీకి తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధం లేదని బిజెపి ఉద్యమాన్ని వక్రీకరిస్తుందని సాయిధ పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. నెల్లికుదురు ప్రాంతంలో ఎంతోమంది బలి అయి సాయుధ పోరాటానికి ఊపిరి పోశారన్నారు సాయుధ పోరాటం ప్రపంచా ప్రఖ్యాతి గాంచిన సెప్టెంబర్ 17న అధికారికంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వరి పల్లి వెంకన్న, బైస స్వామి, చిరా సత్యనారాయణ, తూటి వెంకటరెడ్డి, చిర్రా వెంకన్న, నేతలు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం**

**మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్**



**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 16:** తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్ సంతోష్‌నగర్‌లో జరుగుతున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు బాలాజీ, భూక్యా వీరభద్రం కోరారు. బుధవారం ఏన్కూర్ ప్రజా సంఘాల కార్యాలయం వద్ద తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఏన్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, భూమి, అటవీ హక్కులు, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ గిరిజన సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర మహాసభల్లో గిరిజనుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ మహాసభలకు ప్రజల మద్దతు అవసరమన్నారు. గిరిజన సంఘం నాయకులు కట్రం గంగరాజు, వాంకుడోత్ హతిరామ్ నాయక్, గొర్రె మేకల పెంపక దారుల సంఘం జిల్లా నాయకులు దొంతబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ ఏర్పుల రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికల లెనిన్, ఎట్టి మనీష్, రమేష్, రాములు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన మండల ప్రత్యేక అధికారి



**తొలి అక్షరం/ఏన్కూర్ సెప్టెంబర్ 16:** ఏన్కూరు గురుకుల విద్యాలయాన్ని బుధవారం మండల ప్రత్యేక అధికారి ఎండి ముజాహిద్ ఖాన్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను, గ్రంథాలయాన్ని, డార్మెంటరీ, భోజనశాల, వంట గదులను పరిశీలించారు. టి ఎల్ ఎం తో ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. చిన్ననాటి నుండే క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, ఎంఈఓ వాసవి దేవి,ప్రిన్సిపాల్ వేము రాజు, ఏటీపీ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు

## 27న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ వేడుకలు

**- విజయవంతం చేయాలి... పోస్టర్ ఆవిష్కరణ**

**భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా కొలను శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక**



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 16:** ఈ నెల 27వ తేదీన యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్, జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రాంగణంలో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ రోజు భువనగిరిలోని ఎస్ వి హోటల్ లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి చంద్ర భాను నాయక్ ల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్ హాజరయ్యారు. రాష్ట్ర సభ్యులు గుండు దయానంద్, జగన్ యాదవ్, శ్యామల ముదిరాజ్, జిల్లా నాయకులు బట్టు రామచంద్రయ్య, శ్రీనివాస్ గౌడ్, సాయిలు, శంకర్ రెడ్డి, పాండు, సాయిరెడ్డి, నరసింహ, సుదర్శన్, స్వామి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 27న జరగనున్న 9వ ఆవిర్భావ వేడుకలకు భువనగిరి జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉద్యమకారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం భువనగిరి జిల్లా అధ్యక్షులుగా కొలను శ్రీనివాస రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డా. చీమ శ్రీనివాస్, కొలను శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జిట్టా బాలకృష్ణారెడ్డి ఆశయ సాధన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిరంతరం పని చేస్తుందని తెలియజేశారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 16:**
నెల్లికుదురు మండలంలోని ఏ.ఈ /ఓ పి/మునిగలవేడు కార్యాలయ ఆవరణలో ఈ రోజు న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు టిజి ఎన్ .పి.డి.సి ఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ,కె. మాధవరావు తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ వినియోగదారులు క్రింది సమస్యలకు సంబంధించి తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు:- 1)విద్యుత్ సరఫరా పునరుద్ధరణ:- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి- వోల్టేజ్ హెచ్చుతగ్గులు- డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పెంపుదల- లోపాలు ఉన్న మీటర్ల మార్పిడి- నూతన విద్యుత్ సర్వీసుల మంజూరు- అదనపు లోడ్ క్రమబద్ధీకరణ- సర్వీస్ పేరుమార్పు- వినియోగానికి మించి అధిక మొత్తంలో వచ్చిన విద్యుత్ బిల్లులు- కేటగిరీ మార్పు- సర్వీస్ రద్దు- ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలువిద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున నెల్లికుదురు మరియు దంతాలపల్లి మండలాల పరిధిలోని టీజీ ఎన్ .పీ. డి. సి.ఎల్ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను రాతపూర్వకంగా సమర్పించి పరిష్కారం పొందాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ కె. మాధవరావు (చైర్పర్సన్), శ్రీ ఆర్. శేషారావు (మెంబర్ టెక్నికల్), శ్రీ ఎస్. సత్యనారాయణ (మెంబర్ ఫైనాన్స్), శ్రీ ఎం. రామారావు (ఇండిపెండెంట్ మెంబర్) విద్యుత్ వినియోగదారులను కోరారు.

## చౌటుప్పల్ మున్సిఫ్ కోర్టు ఏర్పాటులో వెన్ రెడ్డి రాజు ప్రత్యేక కృషి

**- కోర్టు ప్రారంభమై ఐదేళ్లు పూర్తైన సందర్భంగా న్యాయవాదులు, ప్రజలకు వార్షికోత్సవ శుభాకాంక్షలు**



**తొలి అక్షరం/చౌటుప్పల్, సెప్టెంబర్ 16:** చౌటుప్పల్ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో చౌటుప్పల్‌లో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు ప్రారంభ దశలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఉన్నతాధికారులను ఒప్పించడంలో కీలకంగా కృషి చేసిన చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్న రెడ్డి రాజు అని పలువురు పేర్కొన్నారు. చౌటుప్పల్ ప్రాంత ప్రజలు న్యాయపరమైన అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగించాలనే లక్ష్యంతో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు ఆయన వ్యక్తిగతంగా చొరవ చూపారు. కోర్టు ఏర్పాటుకు అవసరమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, మున్సిపల్ నిధులతో పాటు వ్యక్తిగతంగా కూడా సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. చౌటుప్పల్‌లో మున్సిఫ్ కోర్టు ప్రారంభమై నేటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా న్యాయవాదులకు, కోర్టు పరిధిలోని ప్రజలకు వెన్న రెడ్డి రాజు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కోర్టు ద్వారా ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సౌకర్యం కోసం తన వంతు కృషి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా రాజు తెలిపారు. చౌటుప్పల్ ప్రాంత అభివృద్ధి, ప్రజా సౌకర్యాల కోసం భవిష్యత్తులోనూ తన సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు.

# ఆదర్శ సర్పంచ్‌కు నిలువెత్తు నిదర్శనం: గర్దాస్ విక్రమ్


తొలి అక్షరం
మా అక్షరమే మీ ఆయుధంగా
E-PAPER www.tholiaksharam.com
తెలుగు దినపత్రిక

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సర్పంచ్ విక్రమ్ ఆర్థిక సాయం

తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 15: ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన నల్ల కృష్ణ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఆయనను పరామర్శించి రూ.5000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి, మాజీ సర్పంచ్ కాటపెల్లి సిద్దమ్మ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ సింగణబోయిన జంగయ్య, ఈర్లపల్లి మల్లేశం, మండది శ్రీధర్ రెడ్డి, చేనేత సహకార సంఘం చైర్మన్ రవ్వ నర్సింహ, మాజీ వార్డు సభ్యులు ఈర్లపల్లి రమేష్, గోల్లేపల్లి యాదయ్య, రాధారపు మల్లేశం, నల్ల మల్లయ్య, భువనగిరి శ్రీను, చిన్నపాక సురేష్, మల్లం మల్లేశం, పుట్టల బాలకృష్ణ, మేడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

www.tholiaksharam.com
16 Sep 2026 - Page 5


తొలి అక్షరం
మా అక్షరమే మీ ఆయుధంగా
E-PAPER www.tholiaksharam.com
తెలుగు దినపత్రిక

అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా...

నాణ్యమైన విద్య నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తా...

ఇంద్రపాలనగరం గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్రపాలనగరం గర్దాసు విక్రమ్

తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 1: ఇంద్రపాలనగరం గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలుఈ దసరా పండుగను గ్రామ ప్రజలు ఆనందంగా సంతోషంగా జరుపుకోవాలని ఆ దుర్గామా త అమ్మవారు గ్రామాన్ని చల్లగా చూడాలని గ్రామంలో ప్రతి ఒక్కరు ఆనందంగా ఆరోగ్యంగా ఆర్థికంగా ఉండాలని మనస్ఫూ ర్తిగా దుర్గామాతను వేడుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలిపినారు

www.tholiaksharam.com
02 Oct 2025 - Page 6


తొలి అక్షరం
మా అక్షరమే మీ ఆయుధంగా
E-PAPER www.tholiaksharam.com
తెలుగు దినపత్రిక

జనసంద్రమైన ఇంద్రపాలనగరం

ఆశీర్వదించండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా సర్పంచ్ అభ్యర్థి గర్దాస్ విక్రమ్

తొలి అక్షరం/రామన్నపేట డిసెంబర్ 3: రామన్నపేట మండలం ఇంద్రపాల నగరానికి చెందిన సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి గర్దాసు విక్రమ్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ నన్ను ఒక్కసారి ఆశీర్వదించండి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా గ్రామంలో పారిశుధ్య సమస్య వీధిలైట్ల సమస్య లేకుంటే చేస్తానని వీధి వీధికి సిసి రోడ్లు నిర్మిస్తానని నిరుపేదలైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేస్తానని గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అదే విధంగా ఉపాధ్యాయుల సహకారంతో ప్రతి విద్యార్థికి మంచి విద్యా అందిస్తాననిఒక్కసారి నన్ను ఆశీర్వదిస్తే గ్రామం యొక్క రూపురేఖలు మార్చి జిల్లాలోని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది కన్నతల్లి లాంటి గ్రామానికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపినారు

www.tholiaksharam.com
04 Dec 2025 - Page 3

**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 17:** ఒక గ్రామ సర్పంచ్ ఎలా ఉండాలో, ప్రజలకు ఎలా సేవ చేయాలో చూపిస్తున్న ఆదర్శ నాయకుడు ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గర్దాస్ విక్రమ్. సర్పంచ్ పదవిని అధికారంగా కాకుండా, ప్రజా సేవకు ఒక అవకాశంగా భావించే విక్రమ్ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, వీధి లైట్లు వంటి మౌలిక సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటారు. సేవే పరమావధిగాతన సేవలను కేవలం అభివృద్ధి పనులకే పరిమితం చేయకుండా, పదిమందికి సహాయం చేసే గొప్ప మనసున్న నాయకుడు విక్రమ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న నల్ల కృష్ణ అనే వ్యక్తిని స్వయంగా పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయం అందించారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు బట్టల పంపిణీ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బెల్టులు, షూలు పంపిణీ చేసి తన జన్మదినాన్ని సేవా దినంగా మార్చుకున్నారు.- 17న తన పుట్టినరోజును కూడా చౌటుప్పల్ లోని అమ్మానాన్న అనాధ ఆశ్రమంలో పిల్లలతో, సాయంత్రం వినాయక మండపం వద్ద అన్నదానంతో జరుపుకోవడం ఆయన సేవా తత్పరతకు నిదర్శనం. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకుని, వివాదాలకు దూరంగా ఉంటూ, గ్రామ పెద్దల సలహాలు తీసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఇలాంటి యువ, సేవా, ఆదర్శ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, గ్రామానికి మరిన్ని సేవలు అందించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. గ్రామ అభివృద్ధి ప్రదాత, ఆపదలో ఆపద్బాంధవుడు అయిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్ కి జన్మదిన శుభాకాంక్షలు. తొలి అక్షరం ప్రత్యేకత కథనం..



# తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

**• భూమి.. భుక్తి.. వెట్టి విముక్తి కోసం రైతాంగ పోరాటం**




**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్16:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ అన్నారు. సీపీఎం షాద్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంవక్రీకరణ, వాస్తవాలు" అంశంపై సెమినార్ నిర్వహించారు. భాస్కర్ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతాంగం పోరాడిందన్నారు. దున్నేవాడికే భూమి దక్కాలనే నినాదంతో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం సాగిందన్నారు. ఎం. రాజు మాట్లాడుతూ ఆపరేషన్ పోలో అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైనప్పటికీ, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం 1951 వరకు కొనసాగిందన్నారు. చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా యువతకు వాస్తవాలు వివరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

# భోగారం యాదవ్ సంఘం గణపతి మండపంలో ప్రత్యేక పూజలు



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 16:** భోగారం యాదవ్ సంఘం గణపతి మండపంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గోగు వెంకటరమణ, గోగు యాదయ్య, గోగు సురేష్ యాదవ్, తెలుసూరి నాగేష్, నిరంజన్ పంతులు, కదారి లక్ష్మణ్, మహావీర్ యాదవ్, మేడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 33 జిల్లాల సర్పంచుల ఫోరం సమావేశంలో గర్దాస్ విక్రమ్




**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 16:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో 33 జిల్లాల అధ్యక్షుల రాష్ట్ర స్థాయి సమావేశం హైదరాబాద్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పాల్గొన్నారు. సర్పంచుల సమస్యలు, 15వ ఆర్థిక సంఘం నిధులు, గౌరవ వేతనం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా పని చేస్తామన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన విక్రమ్ ను నాయకులు అభినందించారు.

# రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో వినాయక పూజ, అన్న వితరణ





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 16:** రామన్నపేట పోలీస్ స్టేషన్ లో వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమం, అనంతరం అన్న వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. వారితో పాటు సిఐ ఎం. రవి, ఎస్సై గోపతి సతీష్, ఏఎస్ఐ సురేందర్, హెడ్ కానిస్టేబుల్ కమలాకర్ రెడ్డి, సిబ్బంది స్వామి నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది సహకారంతో రామన్నపేటలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించారు. యువకులు డప్పు వాయిద్యాలతో, నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# శాంతిభద్రతలతో చెలగాటమాడితే ఖబడ్దార్

- మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి,ఐపిఎస్
- నయీమ్ దారుణ హత్య కేస్ మిస్టరీ ఛేదన
- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్ 16:** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, దాడులు, హత్యలకు పాల్పడే నేర మూకలను, రౌడీషీటర్లను ఎంతమాత్రం సహించేది లేదని వారి ఆట కట్టిస్తామని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి,ఐపిఎస్ స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విచక్షణారహితంగా ప్రవర్తించే వారిపై ఉక్కుపాదం మోపుతామని తీవ్రంగా హెచ్చరించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో ఇటీవల చోటుచేసుకున్న రౌడీషీటర్ దారుణ హత్య కేసును ఎస్ఓటీ (ఎల్బి నగర్ జోన్),నాగోల్ పోలీసులు ఉమ్మడిగా ఛేదించిన సందర్భంగా ఆ వివరాలను సీపీ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం..గత కొంతకాలంగా ఉన్న తీవ్ర విరోధం,ఫోన్లు,సోషల్ మీడియా వేదికగా జరిగిన బెదిరింపులు,వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు విచారణలో తేలింది. బాధితుడిని మట్టుబెట్టేందుకు పక్కా స్కెచ్ వేసిన నిందితులు ఈ నెల 14న సుప్రీం వైన్స్ వద్ద ఉన్నట్లు సమాచారం అందుకుని కారు,బైక్‌లపై వెంబడించారు. బాధితుడి కళ్లలో ఒక్కసారిగా కారం పొడి చల్లి,తప్పించుకునే అవకాశం లేకుండా వేటకొడవలితో తల,చేతులపై విచక్షణారహితంగా నరికారు. ఆపై స్థానికంగా ఉన్న ఒక ఐరన్ బాండీ (ప్యాన్)తో తలపై బలంగా బాదడంతో తీవ్ర గాయాలై బాధితుడు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు, హత్యలో నేరుగా పాల్గొన్న ఏడుగురు (9) నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి దాడికి ఉపయోగించిన వేటకొడవలి,ఐరన్ బాండీతో పాటు ఒక కారు,రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులోని ప్రధాన సూత్రధారితో పాటు పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు తీవ్రతరం చేశామని సీపీ తెలిపారు. రౌడీషీటర్లు,పాత నేరస్థుల కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా బెదిరింపులు,వసూళ్లు,దాడులకు దిగితే ఉపేక్షించే ప్రసక్తి లేదు. చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు ఉంటాయి. నేరాల నివారణకు ప్రజల సహకారం చాలా కీలకమని,అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# భాషా సృజనాత్మకత ప్రశంసనీయం

**• పుడమి హైస్కూల్ ప్రిన్సిపాల్ పద్మిని • పాఠశాలలో అలరించిన హిందీ దివస్ వేడుకలు • అక్షర రూపాలతో విద్యార్థుల ఆకట్టుకునే అభినయం**






**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), సెప్టెంబర్16:** బోడుప్పల్ శ్రీనివాస కాలనీలోని పుడమి హైస్కూల్ ప్రాంగణంలో జాతీయ హిందీ దివస్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మిని మాట్లాడుతూ.. దేశంలో వైవిధ్యమైన సంస్కృతిని, ప్రజా అనుసంధానాన్ని పెంపొందించడంలో హిందీ భాష కీలక పాత్ర వహిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా భాషలోని సృజనాత్మకతను వెలికితీస్తూ ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.

**అలరించిన అక్షర రూపాలు-వినూత్న నృత్యాలు:** ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హిందీ వర్ణమాలలోని అక్షరాల ప్రాముఖ్యతను, వాటి ఉచ్చారణ శైలిని ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన అభినయ విన్యాసాలు అందరినీ విశేషంగా అలరించాయి. అనంతరం నిర్వహించిన ప్రముఖ హిందీ గీతాల ఆధారిత సాంస్కృతిక నృత్య రూపకాలు లోతైన భావ వ్యక్తీకరణతో మంత్రముగ్ధులను చేశాయి. భాషా ప్రాముఖ్యతపై అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, నృత్య పోటీలను నిర్వహించారు. వీటిలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రిన్సిపాల్ పద్మిని చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను, శిక్షకులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓజోన్ పొరను రక్షించండి

# మన భవిష్యత్తును రక్షించండి!"

**• ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించిన అర్వా మెహ్రీన్..**

**తొలి అక్షరం/కరీంనగర్, సెప్టెంబర్ 16:** హైదరాబాద్, అత్తాపూర్‌లోని ఎనారా హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న, పర్యావరణం పట్ల అమితమైన ఆసక్తి గల యువతి అర్వా మెహ్రీన్, కరీంనగర్‌లోని బొమ్మకల్‌లో ఉన్న 'ది లెర్నింగ్ వరల్డ్ స్కూల్'లో ఓజోన్ పొర పరిరక్షణ ప్రాముఖ్యతపై ఒక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో, సూర్యుని నుండి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిని కాపాడటంలో ఓజోన్ పొర పోషించే పాత్రను అర్వా వివరించారు. రంగురంగుల విద్యాసంబంధ పోస్టర్‌ను ఉపయోగించి, మానవ ఆరోగ్యం, మొక్కలు, జంతువులు, పర్యావరణానికి



ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యతను ఆమె ప్రముఖంగా తెలియజేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, హానికరమైన ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, శక్తిని ఆదా చేయాలని, వ్యర్థాలను తగ్గించాలని మరియు మరిన్ని చెట్లను నాటాలని కూడా ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. పర్యావరణ బాధ్యతను అర్థం చేసుకుని, ఆరోగ్యకరమైన గ్రహం వైపు చిన్న చిన్న అడుగులు వేసేలా యువతను ప్రేరేపించడమే ఈ అవగాహన సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం.

## ఆసియా గేమ్స్‌లో టీమ్‌ఇండియాకు

# విప్రజ్ నిగమ్ ఎంపిక



ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్‌ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్‌కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్‌లో టోర్నమెంట్‌లో రాణించిన 22ఏళ్ల దిల్లీ క్యాపిటల్స్ బౌలర్‌కు ఆసియా గేమ్స్‌లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్‌ఇండియాకు రీసెంట్‌గా ఎదురుదెబ్బ తగిలింది. దిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్‌తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్ నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్‌మెంట్‌గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్‌రౌండర్ విప్రజ్ నిగమ్‌ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్‌మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్ కమ్ ఆల్‌రౌండ్ విప్రజ్ నిగమ్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్‌లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్ఆర్ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్‌లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్‌ను కాదని విప్రజ్‌ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్‌ను ఆసియా గేమ్స్‌కు పంపించారు. జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

## కొచ్చి వేదికగా అక్టోబర్‌లో

# మెగా ఆక్షన్ నిర్వహణ..





### ● డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది. రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

# వైభవ్‌తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే



అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.

# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం




గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

## స్విమ్మింగ్‌లో మెరిసిన

# మనీశ్ గౌడ్

### - ఓయూ ఇంటర్‌కాలేజ్ స్విమ్మింగ్ పోటీలు



హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ స్విమ్మింగ్ పోటీల్లో కె. మనీశ్ గౌడ్ (సెయింట్ జోసెఫ్ కాలేజ్) సత్తా చాటాడు. మెన్స్ 100 మీటర్ల, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో పసిడి పతకం సాధించాడు. 50మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం నెగ్గాడు. బద్రుకా కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు అంబర్‌పేట్ స్విమ్మింగ్‌పూల్‌లో జరుగగా.. ఎన్‌జిఐటి, ఎవీఎంఈ, కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజ్‌లు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొ.సునీల్ కుమార్, ఐయూటీ సెక్రటరీ ప్రొ. దీప్ల, బద్రుకా కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్ కుమార్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

**- ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం**



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.' అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ 'సంకల్ప'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొండుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో 'పద్మ భూషణ్'తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# వేగం పెంచిన 'ధర్మన్'




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. "ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను" అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ధర్మమే వెల్లుమ్' (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

# 'ది ప్యారడైజ్'కు సెన్సార్ పూర్తి..



నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, "'పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది ప్యారడైజ్' కథ" అని తెలిపారు.




## ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న

# విశ్వనాథ్ అండ్ సన్స్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం..

ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లీష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ 'రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# న్యూ ఏజ్ మ్యూజికల్ ఫిల్మ్



హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం'. ఈ సినిమా బుధవారం ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి దర్శకులు సురేందర్ రెడ్డి, హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీతానికి, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కనున్న ఈ చిత్రంలో సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక, నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో, సంగీతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో, దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ , "ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హీరో నిఖిల్ గారికి, దర్శకుడు సురేందర్ రెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మా చిత్రబృందాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన నటీనటులందరికీ ధన్యవాదాలు.సుమారు 60 ఏళ్లుగా వెనుకబడిపోయిన రామయ్య అనే వ్యక్తి, అలాగే 20 ఏళ్ల యువకుడు కలిసి ప్రారంభించే మ్యూజికల్ జర్నీ చుట్టూ మా సినిమా కథ సాగుతుంది. ఇది న్యూ ఏజ్ మ్యూజికల్ డ్రామా. సినిమాలో చాలా పాటలు ఉంటాయి. మా చిత్రానికి శేఖర్ చంద్ర అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మంచి తేదీని చూసుకుని థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు.తనికెళ్ల భరణి గారు మాట్లాడుతూ ,'ఈ సినిమాను 'శంకరాభరణం'తో పోల్చడం లేదు. అయితే ఆ సినిమాలో ఉన్న సంగీత స్ఫూర్తి ఈ సినిమాలో కూడా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ఒక పాత తరం సంప్రదాయ సంగీత విద్వాంసుడికి, ఈ తరం జెన్-జెడ్ సంగీతకారుడికి మధ్య ఉండే ఆసక్తికరమైన కలయికను చూపించబోతున్నారు' అని అన్నారు.